# తురంగచంద్రిక

'చిన్న కుటుంబమే చింతలు లేని కుటుంబం' అన్న సూక్తిలో చాలా చిన్నతనంనుంచే విశ్వాసం యేర్పడింది అతనికి. దాని అర్థం తెలుసుకున్నాక మరింత ఆనందం అయింది ఇప్పుడు. అందుకనే పాపపుట్టటంతోటే ఆపరేషన్ చేయించాడు భార్యకు, ఆమెకు మనసారా ఇష్టంలేకపోయినా. పెద్దపిల్లాడికి అయిదేళ్ళు, పొత్తిళ్ళలో పాప.

కరుణాకరానిది ఎదుగుబొదుగులేని ఉద్యోగం అనడానికి వీల్లేదు. ప్రతి సంవత్సరమూ యాభై రూపాయలు ఇంక్రిమెంట్ వస్తుంది. చేరిన తర్వాత యిప్పటికి, అప్పుడే- పదేళ్ళ సర్వీస్‌లో- రెండు ప్రమోషన్లు కొట్టేశాడు. చూచేవాళ్ళకు అసూయ కలిగించే ఉద్యోగం కాకపోయినా అతనికి మాత్రం ఇంతకంటే యింకేం కావాలి? రెండుపూటలా తినడానికి యేమీ కొరత లేదు. ముందు ముందు యెలా జరుగుతుంది అంటూ 'నందో రాజా భవిష్యతి' అనిపిస్తూ వుండేది. ఉండటానికి పిత్రార్జితం ఇల్లువుంది. సమయానికి రిపేర్లు చేసుకుంటూపోతే ఇంకో రెండు తరాల వరకు ఢోకా లేదు.

'మీవన్నీ నిబద్ధమైన పోకడలు. నాకేం బెంగలేదనుకోండి. ముందు ముందు గడ్డురోజులు వస్తాయని అందరూ అనుకుంటున్నారు. పిల్లలు పెద్ద వాళ్ళయి వాళ్ళకు చదువులు, సంధ్యలు సవ్యంగా జరగాలంటే ఎంత డబ్బయినా చాలదట. 'అనడం మొదలుపెట్టింది కస్తూరి పిల్లదానికి మూడో యేడు రావడంతోటే. ఈ పిల్లను మంచి స్కూల్లో వేయించాలంటే కనీసం అయిదువేలన్నా విరాళం ఇవ్వాలి. ప్రతినెల రెండుమూడువందలు స్కూలు ఫీజులకే అయిపోతుంది. మంచి చదువులేకపోతే పిల్లలు రాణించరు. ఎందుకూ కాకుండా పోతారు. వాళ్ళ జీవితాలు కూడా మనలాగే మధ్యస్థంగా- చాలీ చాలని ఆర్థిక వసతిలో ఇమిడి పోవాలా?- అంటుంది కస్తూరి.

నా పిల్లల్ని ఇంగ్లండో అమెరికాయో పంపి చదివిస్తానని నేనెప్పుడూ ఆశలు పెట్టుకోలేదు. ఉన్నంతలో తగుమాత్రం చదువులు చెప్పిస్తాను.

ఆపైన వాళ్ళ అదృష్టం.... అని కరుణాకరం మనసులోనే తీర్మానం చేసుకున్నాడు.

కరుణాకరం జీతం నేరుగా బ్యాంకుకు వెళ్ళిపోతుంది. కస్తూరికి, అతనికి జాయింట్ ఎకౌంట్. చెక్‌బుక్ మాత్రం కస్తూరి దగ్గరే వుంటుంది, అతనికి డబ్బు కావలసి వచ్చినా ఆమెను అడిగి తీసుకుంటాడు.

సూర్యోదయం అవటానికి రెండుగంటలు ముందుగానే నిద్రలేస్తాడు కరుణాకరం. నిద్రమత్తు వదిలేంతవరకు ముఖము, కాళ్ళు, చేతులు కడుక్కొని ముందుగదిలో కూర్చుంటాడు. ఎవరైనా వేడిగా కాఫీ చేసియిస్తే బాగుండును, అనుకుంటాడు గాని వంటింటి లోపలకు ఎప్పుడూ అడుగుపెట్టడు. కస్తూరి నిదానంగా లేస్తుంది. అప్పటికి పాలపాకెట్ వచ్చేస్తుంది. ఆమె కాఫీ తయారు చేసి ఇచ్చేంత వరకు అతని నరాలు తెగలాగుతూ తపనపడుతూ వుంటాయే తప్ప తమంత తాముగా ముందుకు అడుగులు వేసి అవసరాలు తీర్చుకోవు. ఏదో పుస్తకం చదువుతూ కూర్చుంటే తెలియకుండానే కాలం ముందుకునడిచిపోతుంది. మనసుకు విశ్రాంతిగా వెసులుబాటుగా వుంటుంది. జ్ఞానం సంపాదించటంకంటె మనిషికి కావలసింది యింకేం వుంది?

'ఏమండీ, మనం టి.వి. మార్చేయాలండీ' అంటుంది కస్తూరి ఎప్పుడైన సాయంత్రంపూట.

'ఏం, బాగానే పనిచేస్తోందిగా' భార్యమాటలు అనేకమార్లు మొదటి మారుగా అర్థంకావు అతనికి.

'ఏం అంటారేమిటి? మనది బ్లాక్ అండ్ వైట్ కదూ? అందరి ఇళ్ళల్లోనూ కలర్ టి.వి.లే.

'అవును కదూ. అప్పటికి కలర్ టి.వి. లేదు మార్కెట్‌లో. ఉంటే అదే కొనుక్కునే వాళ్ళం. పోనీ కలర్ టి.వి.కంటె, వి.సి.ఆర్. కొనుక్కుంటే బాగుంటుందేమో కదా' అంటాడు.

'కలర్ టి.వి. లేకపోతే వి.సి.ఆర్. కూడా అంత లక్షణంగానే వుంటుంది. ముందు టి.వి. వచ్చిన తరువాతనే ఏదయినా మరో ఆలోచన— అని నిర్ధారిస్తుంది కస్తూరి.

ఆ సంభాషణ అంతటితో ఆగిపోతుంది.

కలర్ టి.వి. కొనడం మటుకు పడదు. దానికోసం ఇప్పుడు అకస్మాత్తుగా పదిపన్నెండు వేలు ఎక్కడనుంచి వస్తాయి?

చేతినిండా డబ్బు ఆడడం లేదని దిగులు కస్తూరికి ఎక్కువ. పుష్కలంగా డబ్బులుంటే అదోదారి. అన్నిటికీ వెదుక్కుంటూ వుండడం. వెర్రితనంతో మనసంతా వెలితిగా తయారవడం అలవాటు అయిపోతుంది. కస్తూరికి. ఈ మనిషి ఉలకడు, పలకడు.

'అమ్మా, మనకు కారెందుకు లేదు? ఎప్పుడున్న బయటికి వెళ్లాలంటే మామయ్యగారి కారు అడుగుతాం ఎందుకని ? ఆటోలకు, టాక్సీలకు ఎదురు చూస్తూ నిలుచుంటాం ఎందుకని? అని అడుగుతాడు కొడుకు.

'మనకా అదృష్టం లేదురా చిన్నా' అంటుంది కస్తూరి.

'అదృష్టమా? అంటే??'

'కనిపించనిది'

'ఎన్నోకార్లు రోడ్లమీద కనిపిస్తూనే వున్నాయిగదమ్మా. మనకెందుకు లేకపోవాలి?'- చిన్న యేవిషయమూ ఒకంతట వదిలి పెట్టడు.

ఆర్థిక సూత్రాలు ఆ చిన్న కుర్రవాడికి ఎలా తెలియచెప్పాలో కస్తూరికి అర్థంకాదు. డబ్బులేదు, అదృష్టంలేదు- అని వాడికి మనసుకు నాటుకునేట్లు చెప్పడం ఎలా?

మన ఇంట్లోలేని వస్తువుల జాబితా అంటూ ఒకటి తయారుచేసాడు చిన్న ఒకమారు. వాషింగ్‌మెషీన్, రిఫ్రిజరేటర్, ప్రతిగదిలోనూ సోఫా, టెలిఫోన్, వంటగదిలో కుకింగ్‌రేంజ్ ... యిలా.

మనకు బోలెడంత డబ్బులేదా— అందుకనే యివన్నీ మన యింట్లో లేవా.... వాడి బుర్రలో అప్పుడే మెదలడం ఆరంభించిన ప్రశ్నలు.

ఓ కీలు గుర్రం వుంది. దానిమీద కూర్చుని ఆలోచిస్తూవుంటే మనసుకు చాలా ఆనందంగా వుంటుంది. కూర్చోవడం తడవుగానే గుర్రం కదలడం ప్రారంభిస్తుంది. కాస్త 'పుష్' యిస్తేచాలు మరో లోకానికి తీసుకుపోతుంది వాడిని. చిన్నప్పుడు మావయ్య బహుమానంగా తెచ్చియిచ్చాడు దీన్ని.

మామయ్యకు గుర్రాలు బాగా డబ్బు యిచ్చాయట. మామయ్యకు డబ్బు యిచ్చిన గుర్రాలు తనకు మట్టుకు ఎందుకు పుష్కలంగా యివ్వవు?-

మళ్ళీ కస్తూరి వాడిబుర్రలో ఆలోచనలు పెడుతుంది. డబ్బువేరు, అదృష్టం వేరు.

'నాన్నకు అదృష్టం లేదా?' అన్నాడు చిన్న ఒకమారు.

'లేదనే అనుకోవాలి'

'మరి నీకో'

"నాన్నగారిని చేసుకున్నాక నాకూ అదృష్టం లేదు. అని జవాబు చెబుదామని అనుకుంది కస్తూరి. కాని ఆమాట పైకి అని చిన్నవాడి మనస్సు పాడుచేయడం యిష్టంలేక మరొక ప్రసక్తి తీసుకువచ్చి దాన్ని దాటవేసింది.

'పోనీ- నేనుకూడా యేదయినా ఉద్యోగం చేస్తానండి!' అంది కస్తూరి, కరుణాకరంతో- ఒక బలహీన క్షణాలలో.

'ఇంటిపనులతో నీకు ఉద్యోగం ఎలా కుదురుతుంది కస్తూరీ, పిల్లల తోనే సతమతమైపోతున్నావు గదా!'

పిల్లలు బడికి వెళ్ళిపోయి, మీరు ఆఫీసుకు వెళ్ళిన తరువాత ఎంత లేదన్నా నాకు రెండుమూడుగంటల విరామం వుంటుంది— అని వివరంగా లెక్కలువేసి చెప్పింది కస్తూరి.

'మధ్యాహ్నం తీరుబాటుగా చేసుకునే ఉద్యోగాలు యేమీ లేవు మన దేశంలో యింకా. ఇంటిదగ్గరే వుండి పనిచేసుకుంటే యేమయినా డబ్బువచ్చే సదుపాయం వుంటుందేమో ఆలోచించు' అన్నాడు కరుణాకరం.

కస్తూరి ఒకటి రెండు ప్రయత్నాలు చేసింది.

డ్రస్ డిజైన్లు తయారుచేసి దుకాణాల వాళ్ళకు యివ్వడం.

ఎడ్వర్‌టైజ్‌మెంట్ 'కాపీలు' తయారుచేసి పబ్లిసిటీ కంపెనీలకు అందించడం.

పనులు చేసుకునే వాళ్ళకు అనుకూలంగా డ్రెస్సులు తయారుచేసే నమూనాలు కొన్ని నిజంగానే లాభించాయి: దుకాణం వాళ్ళకు డబ్బు తీసుకు వచ్చి పెట్టాయి. అలాగే ప్రకటలుగూడా.

'రుచికరమైన భోజనమా?—
పుష్టినిచ్చే ఆహారమా?—
ఈ రెండూ సమ్మిశ్రం అయిన

మా 'సీసాలనే' ఉపయోగించుమా!'

-అని పెద్ద అక్షరాలతో మొదలై, కనిపించీ కనిపించని 'ఫైన్ ప్రింట్' లో ఈ పదార్థాలు ఎలా ఆమోదయోగ్యం అయినవో, అందరికీ తప్పనిసరి అయినవో వివరించే వ్యాఖ్యానాలు వ్రాయడం—

—దీనికోసం బాగా ఆలోచించాలి, బుర్రబద్దలు చేసుకోవాలి.

ఆలోచిస్తూ కూర్చుంటే సమయం గడిచిపోతుంది- కాని పని పూర్తి కాదు. పని పూర్తిచేసి కంపెనీవాళ్ళకు యిచ్చినా తన 'ఆలోచనలు' డబ్బు రూపం ధరించటానికి చాలా నెలలు పట్టేది. ఒక్కోమారు తాము తయారు చేసిన 'కాపీలు' కంపెనీవాళ్ళకు రుచించేవి కావు. అవి అప్పటికీ ఎవరో వాడి పారవేసిన పాడి మాటలుగా తయారయ్యేవి.

కస్తూరికి యివేవి లాభసాటిగా కనిపించలేదు. ఒనగూడలేదు.

మధ్యాహ్నంపూట విశ్రాంతి సమయం అంతా వృధా. మనస్సుకు వెంపర్లాట. తీరా ఫలితం దగ్గరకు వచ్చేసరికి సున్నకు సున్న, హళ్ళికిహళ్ళి. అందుకని యిలాంటి పనులకు స్వస్తి చెప్పటానికి ఎక్కువ నెలలు పట్టలేదు.

'అమ్మా, నాకు అదృష్టం వుంది' అన్నాడు చిన్న ఒకనాడు అతి అకస్మాత్తుగా.

'ఏమయిందిరా?'

'నా కీలుగుర్రం నాకు రహస్యాలు చెబుతుంది. ఈ రహస్యం నేను మామయ్యకు చెబితే మామయ్య దాన్ని ఉపయోగించుకునీ, నాకు డబ్బు తెచ్చియిస్తానన్నాడు.

—కుర్రవాడికి యిప్పటినుండే గుర్రాలపిచ్చి నేర్పుతున్నందుకు అన్నయ్యను గట్టిగా మందలించాలి- అనుకుంది కస్తూరి. వాళ్ళిద్దరూ గదిలో చేరి చేస్తున్న మంతనాలు, గూడుపుఠానీ యిదా?

అంతా బాగానే వుందిగాని తీరా అయిదువేలు చేతుల్లో పడేసరికి ఆలోచనలు చెల్లాచెదరు అయిపోయాయి.

అయిదువేలు! ఎన్ని నెలలు డబ్బు కూడపెడితే అంత పోగుఅయ్యేను?

'అన్నయ్యా, నువు చెబుతున్నది నిజమా? లేక- నీమేనల్లుడి మీద

ప్రేమతో నీవే అయిదువేలు యిస్తున్నావా?' అనడగింది కస్తూరి. తన అన్న ఇంత డబ్బు విచ్చలవిడిగా ఇస్తాడన్న నమ్మకం లేకపోయినా.

'ఇది మా ట్రేడ్ సీక్రెట్. నీకు యిష్టంలేకపోతే మానేస్తాను. ఆ డబ్బు నాదగ్గరే వుంటుంది. చిన్న పెద్దవాడు అయ్యాక వాడికి యిస్తాను' అన్నాడు ఆయన.

కస్తూరి మటుకు తనకు ఈ డబ్బు వెంటనే కావాలా, అక్కర్లేదా అన్న విషయం తేల్చుకోలేకపోయింది.

ఎదురుగా కనిపిస్తున్న పచ్చి నిజాలు.

చిన్నప్పటినుంచి నీతి-నిజాయితీల గురించి నేర్చుకున్న పాఠాలు.

-జీవితంలో సంఘర్షణలు మొదలయ్యాయంటే, అవి జీవితాన్ని అంతం చేస్తాయి.

'నాకిష్టంలేదు అన్నయ్యా. గుర్రాలసంగతి- నువ్వు యికవాడితో మాట్లాడితే నేనే ఊరుకోను' అంది. ఈ అయిదువేలు మొదటిదీ, చివరిదీని.

అన్నయ్య నవ్వి 'అలాగేనమ్మా, నీమాట ఎందుకు కాదంటాను?' అన్నాడు. కాని ఆ నవ్వులో యేదేనా కృత్రిమం వుందా అని కస్తూరికి అనుమానంగానే వుంది.

ఎవరో చెప్పారు కస్తూరికి- పర్సనల్‌కంప్యూటర్ పెట్టుకోండి ఇంట్లో. ప్రోగ్రామింగ్ నేర్చుకోండి. ఈరోజుల్లో కంప్యూటర్లే దేవతలు. ఇష్టఫలాలు యిట్టే సమకూడుతాయి- అని.

ట్రెయినింగ్ అవడానికి నాలుగు నెలలన్నా పడుతుంది.

పి.సి. కావాలంటే మరో పదిహేనువేలు కావాలి. తీరా దానిలో యే 'బగ్' ప్రవేశించకుండా వుండాలి.

కష్టపడాలి. కష్టపడితేనే డబ్బు.

కష్టపడకుండానూ డబ్బు రావచ్చును ఒక్కోమారు. కాని ఆ డబ్బు అనర్థాలు తెస్తుందమ్మా- అవి నాన్నగారు చెవిలో గూడుకట్టుకొని పిల్లలకు చెబుతూవుండడం ఇంకా కస్తూరికి కళ్ళకు కట్టినట్లే వుంటుంది.

అన్నయ్యగూడా ఈ మాటలు విన్నవాడే. ఈ'సెషన్స్' చూచినవాడే.

అన్నయ్యగూడా తనతో- తనమాదిరే- సుశిక్షణలో పెరిగినవాడే. కాని వాడికి డబ్బును గురించి వున్న విపరీతపు ఆలోచన్లు, చతురోపాయాలు ఊహించుకోవటానికే భయం వేస్తుంది, కస్తూరికి.

చిన్న మీద తన అన్న నీడ పడకుండా కాపాడుకొవడం ఎక్కువ కష్టంకాదు కస్తూరికి.

నయం! ఇదంతా కరుణాకరానికి తెలియదు. తెలిస్తే అతని ప్రశాంతతకు భంగం. నిశ్చలంగా వున్న నీళ్ళల్లో గులకరాయి పడవేసినట్లు. విచ్చలవిడి తనంలో హాయి ఉన్నట్లే కనిపిస్తుంది. కాని నిజానికి అది గులాబి కింది ముల్లు కాదూ!

ఆ రోజు కరుణాకరం, సాయంకాలం, ఓ సంగీత కచేరీకి తీసుకు వెళ్ళాడు.

ఎవరో ఉత్తర హిందుస్తాను నుంచి వచ్చినవాడు. పెద్దపేరున్న గాయకుడు. ఆయన దక్షిణాది కర్ణాటక సంగీత విద్వాంసుడు కలిసి చేసిన "జుగళ్‌బంది".

వినడానికి చాలహాయిగా వుంది. దేనికి అదే.

ఒక పక్క ఖయాల్.

మరోపక్క పల్లవి.

'పిల్లలు యింటిదగ్గర ఒక్కళ్ళే వున్నారు. త్వరగా యింటికిపోదాం టాక్సీ 'పిలవండి-' అంది కస్తూరి కచేరీ అయి బయటకు రావడంతోటే.

కరుణాకరం ఆమెవంక విచిత్రంగా చూచాడు.

ఇలాంటి సమయాలలో సరదాగా నడుచుకుంటూ ఇంటికి పోదాం అంటుంది కస్తూరి- తనకు అదే యిష్టం.

'ఏం, మీ అమ్మగారు వున్నారుగా ఇంట్లోనే. పిల్లలు ఈనరికి నిద్ర పోయివుంటారు' అన్నాడు కరుణాకరం.

'అమ్మకు వంట్లో బాగులేదు. పిల్లలకు అన్నాలు సరీగా పెట్టిందో లేదో. మళ్ళీవాళ్ళు నిద్రలో కూరుకుపోతే లేవడం కష్టం ... అమ్మా ఎక్కువ సేపు మేలుకొని వుండలేదు గదా!' అంది కస్తూరి.

'అలాగే-' అంటూ తాత్సారం చేస్తున్నాడు కరుణాకరం, టాక్సీ కోసం యేమీ ప్రయత్నం చేయకుండానే.

ఎదురుగా వస్తున్న ఆటోను తానే చేయిఊపి ఆపి డ్రైవర్ చేత రూల్ కు వ్యతిరేకంగా అక్కడికక్కడే 'యు' టర్న్ చేయించి, 'ఎక్కండి. ఇంకా చూస్తూనించుంటారేం!' అంది కస్తూరి.

కరుణాకరానికి సాయంత్రం షికారు సరదా అట్టే వుండిపోయింది.

ఆటోలోనుంచే ఆకాశం వైపు చూస్తే, పూర్ణిమ చంద్రుడు నిండుగా నవ్వుయు కనిపించాడు.

'ఇవాళ పౌర్ణమికదూ? మరిచేపోయాను'-అన్నాడు కస్తూరికి చంద్రుడిని చూపిస్తూ.

'అవును. రేపటినుంచి కృష్ణపక్షం ప్రారంభం' అంది కస్తూరి, దిగులు దిగమింగుకుంటూ.

*